క్లుప్తంగా

నిత్య కల్యాణం పునరుద్ధరణ



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : సింహగిరిపై శనివారం నుంచి నిత్య కల్యాణాన్ని పునరుద్ధరించారు. గడిచిన ఐదు రోజులుగా జరిగిన తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్రం పూజలు సందర్భంగా నిత్యకల్యాణం నిలిపేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తిరిగి శనివారం నిత్య కల్యాణం పునరుద్ధరించారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలను అందజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు కల్యాణం నిర్వహించారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి



తిరువీధిలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి మాస జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం విశేషంగా తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకీలో వేంజేపచేశారు. సింహగిరి మాడవీధుల్లో తిరువీధి వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దర్శన క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల, దేవస్థానం, ఆర్టీసీ బస్సులు భక్తులతో రద్దీగా మారాయి. అన్నప్రసాద వితరణ భవనం వద్ద భక్తులు బారులు తీరారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి

పెందుర్తి : స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం నివేదించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, దీపోత్సవం, దూప సేవ, రాజభోగం, సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు అన్న ప్రసాదం, మజ్జిగ అందించారు.

రూ. 4.99 కోట్లు వృథా..!



జాలరిపేట తుపాను షెల్టర్ భవనం చుట్టూ తుప్పలు



ముత్యాలమ్మపాలెంలో రక్షణ గోడ లేని తుపాను షెల్టర్ భవనం

ఏడేళ్లలోనే మూలకు చేరిన తుపాను షెల్టర్లు

- కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చేసిన అధికారులు
- నిర్వహణ లేక మరమ్మతులకు నోచుకోని భవనాలు
- భారీ వర్షాల సమయంలో మత్స్యకారులకు ఇబ్బందులు

పరవాడ: నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా మారాయి. విపత్తుల బారి నుంచి తీర ప్రాంతాల ప్రజలకు రక్షణ కల్పించేందుకు జాతీయ విపత్తుల నివారణ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో ముత్యాలమ్మపాలెం, జాలరిపేట, తిక్కవానిపాలెం గ్రామాల్లో తుపాను రక్షిత భవనాలు నిర్మించింది. 2017లో సుమారు రూ.4.99 కోట్ల వ్యయంతో పై మూడు తీర ప్రాంత గ్రామాల్లో నిర్మించిన భవనాల్లో విద్యుత్, తుపాను హెచ్చరిక పరికరాలు, సోలార్ సదుపాయం, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీటి సదుపాయాలు కల్పించారు. దీంతో తుపాన్ల సమయంలో ఈ భవనాలను రక్షణ కేంద్రాలుగా వినియోగించుకునేవారు. ఆ తర్వాత గ్రామాల్లో జరిగే శుభకార్యాలు, సభలు, సమావేశాలను భవనాల్లో నిర్వహించుకునేవారు.



ముత్యాలమ్మపాలెం భవనంపై పనిచేయని తుపాను సైరన్ పరికరం



జాలరిపేట భవనంపై పనిచేయని సోలార్ పలక



ముత్యాలమ్మపాలెం భవనం మెట్ల మార్గంలో ఇనుప గేటు లేని దృశ్యం

పర్యవేక్షించే నాథుడే లేడు...

భవనాలను ప్రారంభించి వాటి పర్యవేక్షణ బాధ్యతను స్థానిక వెలుగు సిబ్బందికి ప్రభుత్వం అప్పగించింది. నిర్వహణ కోసమని ఒక్కొక్క భవనానికి రూ.5 లక్షల చొప్పున బ్యాంకులో డ్వాక్రా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ పేరున జమ చేశారు. అయితే బ్యాంకులో జమ చేసిన నిధులను ఏ విధంగా వినియోగించాలో ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో ఆ డబ్బులు అక్కడే మూలుగుతున్నాయి. బ్యాంకులో డబ్బులున్నప్పటికీ వినియోగించుకొనే వీలు లేకపోవడంతో భవనాలకు మరమ్మతులు చేయించలేని పరిస్థితి నెలకొంది.

- జాలరిపేటలో 2017లో రూ.1.11 కోట్లతో నిర్మించిన తుపాను రక్షిత భవనం చుట్టూ అడవిని తలపించేలా తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. ఇక్కడి పరిసరాలన్నీ విష జంతువులకు నివాసంగా మారాయి. భవనంలో ఏర్పాటు చేసిన మంచినీరు, సోలార్, విద్యుత్, మరుగుదొడ్లు మరమ్మతులకు గురయ్యాయి. తుప్పలు, డొంకల మధ్య రెండు గదుల్లో ఎలిమెంటరీ పాఠశాల నిర్వహిస్తున్నారు.
- తిక్కవానిపాలెంలో రూ.2.45 కోట్లతో నిర్మించిన తుపాను షెల్టర్‌ను స్థానికులు పేకాట క్లబ్‌గా వినియోగిస్తున్నారు. భవనం తుప్పలతో నిండిపోయింది. విద్యుత్, మంచినీటి సదుపాయాలు మూలకు చేరాయి. తుపాను హెచ్చరికలు తెలిపే పరికరాలు పనికిరాకుండా పోయాయి.
- ముత్యాలమ్మపాలెంలో రూ.1.42 కోట్లతో నిర్మించిన తుపాను షెల్టరు భవనం పూర్తిస్థాయిలో శిథిలమై మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. ఇనుప గేట్లు తీరంలోని ఉప్పు గాలికి తుప్పు పట్టాయి. మరోవైపు మెట్ల మార్గంలో ఇనుప గేట్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుపోయారు. గచ్చులు పాడవడంతోపాటు కిటికీ అద్దాలు పగిలిపోయాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తిగా పాడైంది. మంచినీటి బోరు నిరుపయోగంగా ఉంది. రక్షణ గోడ లేక స్థానికులు షెల్టర్‌ను అధ్వానంగా మార్చేశారు.

రక్షణ గోడ లేక అధ్వానంగా...



ముత్యాలమ్మపాలెంలో నిర్మించిన తుపాను షెల్టర్ భవనానికి రక్షణ గోడ నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రహరీ లేక స్థానికులు భవనాన్ని ఇష్టానుసారంగా పాడు చేస్తున్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టి శుభకార్యాలు, సమావేశాలకు వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– చింతకాయల ముత్యాలు, ముత్యాలమ్మపాలెం

తుప్పలు తొలగించాలి



జాలరిపేటలో నిర్మించిన తుపాను షెల్టర్ భవనానికి స్వల్ప మరమ్మతులు అవసరం. భవనం చుట్టూ దట్టంగా పెరిగిన తుప్పలు, డొంకలను తొలగించాలి. ఆ భవనంలోనే పాఠశాల నిర్వహిస్తున్నారు. చుట్టూ తుప్పలు వల్ల విష జంతువులు సంచరిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు భయపడుతున్నారు. తక్షణమే తుప్పలు తొలగించాలి.

– ఒలిశెట్టి పోలమ్మ, జాలరిపేట

అధికారుల పర్యవేక్షణ అవసరం



కోట్లాది రూపాయలతో నిర్మించిన తుపాను షెల్టర్ భవనాలపై అధికారుల పర్యవేక్షణ లేక స్థానికులు అధ్వాన్నంగా తయారు చేస్తున్నారు. విద్యుత్ పరికరాలు, తదితర సామగ్రి అపహరించుకుపోతున్నారు. ఈ భవనాలకు చిన్నచిన్న మరమ్మతులు చేపడితే తుపాను సమయంలో ప్రజలకు ఉపయోగపడతాయి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

– ఆనంద్, తిక్కవానిపాలెం

వైభవంగా బంగారమ్మ మహోత్సవాలు



ఆలయ కలశాన్ని తిరువీధిగా తీసుకొస్తున్న పూజారి వంశీయులు, భక్తులు



అమ్మవారి విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న పూజారులు, భక్తులు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, వరాహ లక్ష్మీ నృసింహ స్వామి సోదరి బంగారమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణం, పునః విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండో రోజు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశనలు, వాస్తు హోమం, వాస్తు బలిహరణ, నిత్య బలిహరణ, యంత్రాలకు అగ్ని స్పర్శ, కలశాల శుద్ధి, క్షీరాభిషేకం, జలాధివాసం, గ్రామ బలిహరణ, సాయంత్రం ధాన్యాధివాసం, యాగశాలార్చన, దేవతాహ్వానం, హోమం, పంచసవ్యాధివాసం తదితర పూజలు నిర్వహించారు. దేవస్థానం వేదపండితులు ఈ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. అమ్మవారి ఆలయ పూజారులు లండ వంశస్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠ, కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

పేదలకు రగ్గుల పంపిణీ

సబ్బవరం: పేదలకు సేవ చేయాలనే ఆశయంతో మదర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి సేవలందిస్తున్న ట్రస్ట్ వ్యవస్థాపకుడు సత్యగంగరాజుకు మరింత ప్రోత్సాహన్ని అందించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు పిలుపునిచ్చారు. సబ్బవరంలోని స్థానిక స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆవరణలో ట్రస్ట్ సమకూర్చిన రగ్గులను పేదలకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యగంగరాజు సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు లభించాయన్నారు. సబ్బవరం మండలంలో సున్నంబట్టీలు వద్ద తనకున్న 50 సెంట్లు స్థలాన్ని ట్రస్ట్‌కు రాసిచ్చి అనాథాశ్రమం నిర్మిస్తూ ఉదారతను చాటుకున్నారన్నారు. ట్రస్ట్ కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని, భవన నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తానని తెలిపారు. అనంతరం టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు సత్యగంగరాజు, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా కార్యదర్శి దెడ్డం పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు రగ్గులు పంపిణీ చేస్తున్న చొక్కాకుల వెంకటరావు తదితరులు

సదుపాయాలు కల్పించడమే లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: నియోజకవర్గంలోని ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. జీవీఎంసీ 97వ వార్డులో రూ.2.70 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శనివారం శ్రీకారం చుట్టారు. టీచర్స్ లే అవుట్, వెంకటాద్రినగర్, గోపాలకృష్ణనగర్, సుజాతనగర్, హస్మినగర్, ఉడా కాలనీ ప్రాంతాల్లో తారు రోడ్లు, పార్కులు, కాలువలు నిర్మిస్తారని తెలిపారు. వార్డులో పాదయాత్ర ద్వారా స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ శానాపతి వసంత, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

'మా కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించండి'

పెందుర్తి: తమ కాలనీకి విద్యుత్ సౌకర్యంతోపాటు మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ జీవీఎంసీ 97వ వార్డు బర్షన్‌నగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుకు విన్నవించారు. శనివారం ఎమ్మెల్యేను కలిసిన కాలనీ వాసులు తమ సమస్యలను చెప్పుకున్నారు. కాలనీని అభివృద్ధి చేయాలంటే స్థానిక ప్రజాప్రతినిధి భారీ ఎత్తున లంచం డిమాండ్ చేస్తున్నారని వివరించారు. దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు.

నిరుపయోగంగా మంచినీటి ట్యాంకు

పరవాడ: ముత్యాలమ్మపాలెం శివారు జాలరిపేట కాలనీలో నిర్మించిన మంచినీటి పథకం ట్యాంకు నిరుపయోగకంగా ఉంది. కొంత కాలం పాటు గ్రామస్తుల దప్పిక తీర్చిన ఈ ట్యాంకు మరమ్మతులకు గురైంది. దీనికి ప్రత్యామ్నాయంగా కాలనీలో మరో మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. దీంతో పాత వాటర్ ట్యాంకు నిరుపయోగంగా పడి ఉంది. ముందే రిపేర్ల కారణంగా విడిచిపెట్టిన వాటర్ ట్యాంకును తొలగించకుండా వదిలేయడంతో అది ఎప్పుడు కూలిపోతుందోనని సమీపంలో నివసిస్తున్న ప్రజలు భయపడుతున్నారు. పాడైన ఈ వాటర్ ట్యాంకును తొలగించాలని అధికారులకు విన్నవించినా.. ఫలితం లేదని వాపోతున్నారు. రాత్రి వేళలో ట్యాంకు నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయని, భయం భయంగా కాలం గడుపుతున్నామని ఒ.పోలమ్మ అనే మహిళ ఆందోళన వ్యక్తం చేసింది. అధికారులు పరిశీలించి కూలడానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



జాలరిపేటలో వినియోగంలో లేని మంచినీటి ట్యాంకు

నామినేటెడ్ పద్ధతిలో నియమించుకోవాల్సింది..

- సాగునీటి సంఘాల ఎన్నికల తీరుపై వైఎస్సార్‌సీపీ నేతల విమర్శలు
- కూటమి నేతల పెత్తనంపై అభ్యంతరం



సబ్బవరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న గండి రవికుమార్ తదితరులు

సబ్బవరం: ఎన్నికలు అనే ముసుగులో ఏకపక్షంగా సాగునీటి సంఘాలకు తమ అభ్యర్థులను ఎన్నుకునే కంటే.. నామినేటెడ్ పద్ధతిలో సొంత అభ్యర్థులను నియమించుకుంటే బాగుండేదని కూటమి నేతలను వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ నేత, మొగలిపురం రైతు గండి రవికుమార్ విమర్శించారు. మొగలిపురంలో ఏకపక్షంగా జరిగిన నేరేళ్ల చెరువు సంఘం ఎన్నికల నిర్వహణ తీరుపై శనివారం ఆయన సబ్బవరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశముంటే.. వారిని సమావేశ పరచి, గ్రామసభ నిర్వహించి అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే బాగుండేదన్నారు. గ్రామంలో కూటమి నేతలకు సమాచారమిచ్చి గుట్టుచప్పుడు కాకుండా ఎన్నికల తంతును ముగించి తమ వారిని పాలకవర్గ సభ్యులుగా నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం గ్రామంలో మూడు సాగునీటి చెరువులు ఉన్నప్పటికీ తాను ఆయకట్టు రైతుగా ఉన్న నేరేళ్ల చెరువు ఎన్నికల నోటిఫికేషన్ గాని, ఓటర్ల జాబితా గాని సచివాలయంలో ప్రచురించ లేదని విమర్శించారు. కూటమి నేతలు అడ్డదారులు తొక్కేందుకు ప్రయత్నిస్తున్న సాగునీటి సంఘాల ఎన్నికలను తమ పార్టీ ముందుగానే బహిష్కరించిందని చెప్పారు. ఎన్నికల నిర్వహణపై గ్రామ స్థాయిలో ఎన్నికల అధికారిగా ఉన్న వీఆర్వోను ప్రశ్నిస్తే.. తనకు పూర్తిగా తెలియదని బదులివ్వగా.. తహసీల్దార్‌ను ప్రశ్నిస్తే నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని ఒకరికి ఒకరు విరుద్ధంగా బదులిచ్చారని విలేకరుల సమావేశంలో గండి రవికుమార్ తెలిపారు.

వీఆర్వో నిర్వాకం వల్లే ఎన్నికలు ఏకపక్షం

తవ్వవానిపాలెంలో వీఆర్వో రాంబాబు నిర్వాకం వల్ల కూటమి నాయకులు ఏకపక్షంగా వ్యవహరించి సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించి తమ అభ్యర్థులను ఎన్నుకున్నారని ఎంపీటీసీ బోకం బాలు ఆరోపించారు. తవ్వవానిపాలెంలోని పుచ్చవాని చెరువుకు శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సాగునీటి సంఘం ఎన్నికలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చెరువుకు సుమారు 200 మంది వరకూ ఆయకట్టు రైతులు ఉన్నారన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయకట్టు రైతులు నీటి పన్ను చెల్లించాలంటూ వీఆర్వో.. కూటమి నేతల వద్ద శుక్రవారం సాయంత్రం వరకు గుట్టుచప్పుడు కాకుండా పన్నులు కట్టించుకున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకుని సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసే తమ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు బోకం సూర్యనారాయణ, కిల్లి దేముడుబాబు, వేచలకు వెంకట నాగేశ్వర రమణ, బోకం సూర్యనారాయణ, బోకం దినేష్, వేచలపు సత్యనారాయణ తదితరులు పన్ను చెల్లించడానికి వెళ్తే.. ఇప్పటికే సాయంత్రమైపోయిందని, శనివారం ఉదయం కట్టించుకుంటానని వీఆర్వో చెప్పి ఇంటికెళ్లి పోయారన్నారు. మరుసటి రోజు ఉదయం పన్ను చెల్లించేందుకు వచ్చిన వారితో సమయం అయిపోయిందని, పన్ను కట్టించుకోమని వీఆర్వో బదులిచ్చారన్నారు. దీనిపై శనివారం ఉదయం ఆర్ఐ, తహసీల్దార్‌లను అడగ్గా.. శుక్రవారం రాత్రి వరకూ మాత్రమే సమయం ఇవ్వడంతో గడువు ముగిసిందని చెప్పారన్నారు. నీటి పన్ను లేకపోవడంతో తమ పార్టీ సానుభూతిపరుల నామినేషన్లను ఎన్నికల్లో తిరస్కరించారన్నారు. దీనిపై వీఆర్వో రాంబాబును ప్రశ్నించగా.. తాను అనంతపురం, కడప, కర్నూలు వంటి ప్రాంతాల్లో పనిచేసి అక్కడి నాయకులకే చెమటలు పట్టించానని, మీకు నచ్చింది చేసుకోండని ఎదురు తిరిగినట్లు ఎంపీటీసీ బోకం బాలు ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం



మహా చండీయాగం నిర్వహిస్తున్న భవానీ భక్తులు

పెందుర్తి : స్థానిక నూకాంబిక, దుర్గా భవానీ భక్తి పీఠం ఆధ్వర్యంలో శనివారం మహా చండీయాగం ఘనంగా నిర్వహించారు. గురు భవానీలు శరగడం సురేష్, శరగడం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా యాగం జరిపారు. సాయంత్రం శూలాలతో భక్తులు ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం అగ్ని గుండాలు తొక్కి మొక్కులు చెల్లించారు. భవానీ భక్తులకు అయ్యప్ప భక్తి పీఠం ప్రతినిధులు అల్పాహారం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు



పరవాడ ఊర చెరువు ఆయకట్టు సాగునీటి సంఘ కార్యవర్గం




భర్ణికం పెద్ద చెరువు ఆయకట్టు సాగునీటి సంఘ కార్యవర్గం

పరవాడ: మండలంలో శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. పరవాడ ఊర చెరువు సంఘ ఎన్నికలను స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎన్నికల అధికారి జి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా సిరపరపు సింహాచలం(అయ్యబాబు), ఉపాధ్యక్షుడిగా డెక్కా చెల్లారావు, డైరెక్టర్లుగా చిరికి అప్పలనాయుడు, చుక్క గోపి, పైల జగదీష్, అప్పారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- భర్ణికం పెద్ద చెరువు ఆయకట్టు సంఘం ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి డి.ఎస్.శ్యామ్ సుందర్ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా బొండా గోవిందు, ఉపాధ్యక్షుడిగా పెదిశెట్టి వెంకట సత్యారావు, డైరెక్టర్లుగా పైల కృష్ణారావు, సిరపూరు బైరాగిరాజు, బోండా చిన్నారావు, ప్రగడ అప్పారావు ఎన్నికయ్యారు. పరవాడ తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్, నాయకులు పంచకర్ల ప్రసాద్, బొండా తాతారావు, దాట్ల గణేష్‌రాజు, వర్రి వరదేశినాయుడు, భర్ణికం ఉప సర్పంచ్ పెదిశెట్టి సత్యారావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని 23 సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని ఇరిగేషన్ ఏఈ సాయికిరణ్ తెలిపారు. ఒక్కో సంఘానికి 6 చొప్పున మండలంలో 138 టీసీలు ఉన్నాయన్నారు. వీటిలో 9 టీసీలకు ఎన్నికలు రద్దయినట్లు చెప్పారు. 5 టీసీలకు ఎన్నికలు జరగ్గా.. మిగిలిన 124 టీసీలు ఏకగ్రీవమయ్యామన్నారు.

గోతులమయంగా వంతెన



మరమ్మతులకు గురైన తిక్కవానిపాలెం వంతెన

పరవాడ: వాడచీపురుపల్లి–తిక్కవానిపాలెం గ్రామాల మధ్య ఏళ్ల కిందట నిర్మించిన వంతెన మరమ్మతుల కోసం ఎదురు చూస్తోంది. గతంలో ఈ రోడ్డు మరమ్మతులు చేసి వంతెనను వదిలేశారు. మత్స్యకారులు నివసిస్తున్న ఈ గ్రామంలో తీర ప్రాంతానికి రాకపోకలు సాగించే సందర్శకులతో పాటు ఆటోలు, బస్సులు, లారీలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. అనేక ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన గుంతలమయంగా మారింది. రాళ్లు తేలి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వాహన చోదకులు చెబుతున్నారు. రాత్రి సమయంలో కాలినడకన రాకపోకలు సాగించే ప్రయాణికులు వంతెనపై ఏర్పడిన గోతుల కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. అధ్వానంగా ఉన్న వంతెనకు మరమ్మతులు నిర్వహించాలని అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం కనిపించలేదని స్థానిక గంగపుత్రులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.